

7,190 స్వయం సహాయక సంఘాలకు రూ.452 కోట్లు..



జిల్లాలో 7,190 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.452 కోట్లు రుణాలు ఇచ్చినట్లు అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఉపాధిహామీ పథకంలో 2.63 లక్షల మంది కూలీలకు జాబ్‌కార్డులు అందించి 36 లక్షల పనిదినాలు కల్పించగా, రూ.63 కోట్లు వారి ఖాతాలో జమ అయ్యాయని చెప్పారు. ప్రమాదవశాత్తు మరణించిన ఐదు గీతకార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.70 లక్షలు అందించినట్లు వివరించారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. అటవీశాఖ ద్వారా హరితహారంలో 15 లక్షల మొక్కలను నాటడం జరిగిందన్నారు. దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు ఇవ్వడం జరిగిందన్నారు. కల్యాణలక్ష్మి కింద 1,843 లబ్ధిదారులకు రూ.18 కోట్లు, షాదీముబారక్ ద్వారా 1,100 మందికి రూ.10 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. విద్యాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ బడుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

- సమగ్రాభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలి
- ప్రజలందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- పల్లె ప్రగతితో పురోభివృద్ధిలో గ్రామాలు
- దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో జిల్లాను అన్నిరంగాల్లో అగ్రభాగంలో నిలుపుదామని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా ప్రగతిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా పోలీసులచే గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోలీసులు మార్చ్‌ఫాస్ట్ పరేడ్ నిర్వహించారు. ఆపై కలెక్టర్ జిల్లా ప్రగతిపై సందేశాన్నిచ్చారు.

ప్రజలందరికీ అన్నిరంగాల్లో సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని కొనియాడారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టిందని, మహబూబాబాద్ జిల్లాలో డిసెంబరు 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 6 వరకు ప్రజాపాలనలో 2,44,506 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 9 లక్షల మంది మహిళలు ఉచిత బస్సుప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో 100 పడకల ఆస్పత్రిని 330 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి, పేదలకు కార్పొరేట్ తరహా వైద్యాన్ని చేరువచేశారని తెలిపారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా 134 రకాల వైద్యపరీక్షలు అందుబాటులోకి రాగా, ఇప్పటి వరకు 1,68,156 మందికి సుమారు 5లక్షల రకాల పరీక్షలు చేసినట్లు వివరించారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా..

పల్లెప్రగతితో జిల్లాలోని గ్రామాలు పురోభివృద్ధి చెందుతున్నాయని, మొత్తం 461 గ్రామపం చాయతీల్లో పల్లెప్రకృతివనాలు, వైకుంఠధామాలు పూర్తయ్యాయని అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కర్షకుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి, వారికి రూ.47 కోట్లు అందించామన్నారు. ప్రమాదానికి గురైన రైతులకు రూ.5లక్షల బీమా అందించడం జరుగుతుందని, ఇప్పటి వరకు 297 మందికి రూ.14 కోట్లను అందచేశామన్నారు. ప్రధానమంత్రికి సాన్ సమ్మాన్‌నిధి కింద రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ.6వేల చొప్పున 90, 561 మంది రైతులకు రూ.299 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని పేర్కొన్నారు. 1,590 చెరువుల కింద 95,460 ఎకరాల అయుకట్టు సాగవుతోందని తెలిపారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా దాదాపు 1,92,666 ఎకరాలు, 18 ఎత్తిపోతల పథకాల ద్వారా 8,183 ఎకరాలు సాగవుతున్నట్లు వివరించారు.



మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అద్వైత్ కుమార్ సింగ్



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు..

మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. మహబూబాబాద్ కస్తూర్బాగాంధీ బాలికలపాఠశాల (కేజీబీవీ) పాఠశాల విద్యార్థినులు తైక్వాండో విన్యాసాలు చేసి అబ్బుర పరిచారు. మానుకోట బాలికల హైస్కూల్ విద్యార్థినులు కోయ, బంజార సాంస్కృతిక, సంప్రదాయ పాటకు ప్రదర్శన ఇచ్చారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కళాశాల మానుకోట విద్యార్థినులు దేశభక్తి జానపద గేయానికి నృత్యం చేశారు. చివరగా ఈదులపూసపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు దేశ్‌కి రంగీలా అంటూ దేశభక్తి పాటకు ప్రదర్శన ఇచ్చారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధులను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలందించి, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సవ్‌టొప్పో, ఎం.డేవిడ్, డీఎఫ్‌వో రవికిరణ్, ఆర్డీవో అలివేలు, అదనపు ఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ సత్యనారాయణ, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



గణతంత్ర వేడుకలకు హాజరైన అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

యూరియా కోసం రైతుల ఆందోళన



కాంపల్లి సహకార సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సీరోలు, జనవరి 26 : కాంపల్లి సహకార సొసైటీ వద్ద రైతులు యూరియా కోసం శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మల్లు వెంకటేశ్వర్లు, గండ్రాతి మల్లయ్య, పెద్దిమల్లయ్య మాట్లాడారు. రబీసాగు ప్రారంభమైనప్పటికీ సొసైటీ ద్వారా రైతులకు అందించాల్సిన యూరియా బస్తాలనుఇవ్వటంలేదని ఆరోపించారు. యూరియా కోసం నెలరోజులుగా సంబంధిత సొసైటీ పాలకవర్గాన్ని అడినప్పటికీ, ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. అందుకే సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్నామని, సంబంధిత జిల్లా అధికారులు స్పందించి యూరియా అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బిక్షం పాల్గొన్నారు.

'నల్ల చట్టాలను రద్దు చేయాలి'



మానుకోటలో ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 26 : కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సం యుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో మానుకోటలో శుక్రవారం ధర్నా చేపట్టారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్, మదర్‌థెరిస్సాసెంటర్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ట్రాక్టర్, బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం నేతలు నెల్లూరి నాగేశ్వర్‌రావు, పాయం చిన్నచంద్రన్న, గునిగంటి రాజన్న, చింతకుంట్ల వెంకన్న, అల్వాల వీరయ్య మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్లచట్టాలను తీసుకువచ్చిందని వాటిని రద్దు చేయాలని గత 14 నెలలుగా పోరాడుతున్నప్పటికి కేంద్రం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిసక్క, జగ్గన్న, కొమ్మయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, జడ సత్యనారాయణ, ఎస్కే, బాబన్న, మేక వీరన్న, తాజ్‌పాషా, దేవేందర్, నల్లు సుధాకర్‌రెడ్డి పాల్గొనగా వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆకుల రాజు, అజయ్‌సారథిరెడ్డి, ఎస్కే, మదారు, హెచ్.లింగన్న, కొత్తపల్లి రవి, రేషపల్లి నవీన్, కుంట ఉపేందర్, శివారపు శ్రీధర్, పర్వత కోటేష్ సంఘీభావం తెలిపారు.

గణతంత్ర వేడుకల్లో విషాదం

- జెండా గద్దెపై పైపు అమర్చుతుండగా ప్రమాదం
- 11కేవీ విద్యుత్ లైన్‌కు తాకిన పైపు
- మరొకరికి తీవ్ర గాయాలు

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతి



అంజిత్, విజయ్ (ఫైల్)

ములుగు, జనవరి26 : చెమటోడ్చితేనే కానీ పూటగడవని జీవితాలు ఆ యువకులవి.. రోజువారి కూలీపనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.. దేశభక్తిని నరనరాన ఇనుమడించుకున్న వారు గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ఊహించని విధంగా విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని శివాలయం (నగరేశ్వరస్వామి దేవాలయం) ఎదుట ప్రతీ ఏడు లాగే గణతంత్ర వేడుకలు జరిపేందుకు స్థానిక యువకులు ఏర్పాట్లు చేశారు. పరిసరాలలో భారతదేశ చిత్రపటాన్ని వేశారు. చుట్టూ తోరణాలు కట్టారు. ఉదయం 9.20గంటల సమయంలో జాతీయ జెండా కట్టిన ఇనుప పైపునుగద్దెపై అమర్చే క్రమంలో పైనున్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఆపైపును పట్టుకున్న ల్యాద విజయ్, బోడ అంజిత్, బోడ కల్యాణ్ చక్రవర్తి షాక్‌కు గురై కిందపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే అంజిత్ (36) మృతిచెందగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్(25)కు సీపీఆర్ చేసి న వైద్యులు కాపాడే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటికే ఆయన కూడా మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్ చక్రవర్తికి ప్రథమ చికిత్స చేయడంతో కోలుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం అతడిని కటుంబసభ్యులు హనుమకొండకు తరలించారు. మృతులిద్దరూ నిరుపేద దళిత కుటుంబానికి చెందినవారు. అంజిత్‌కు భార్య ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. గృహనిర్మాణ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేసే అంజిత్ రోజువారి కూలీ డబ్బులతో భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. అవివాహితుడైన విజయ్ స్థానికంగా ఓ కూల్‌డ్రింక్ డీలర్ వద్ద పనిచేస్తున్నారు. కొద్ది క్షణాల క్రితం వరకు తమ కళ్లెదుటే ఉన్న వారు విగతజీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు బోరున విలపించారు. కుటుంబ పెద్ద మరణించడంతో తాను, ముగ్గురు పిల్లలం అనాథలయ్యామని అంజిత్ భార్య లావణ్య రోదించింది. వృద్ధాప్యంలో ఉన్న తమను చూసుకుంటున్న ఒక్కగానొక్క కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడంటూ విజయ్ తల్లిదండ్రులు లక్ష్మి-శంకర్ కన్నీరు పెట్టుకున్నారు. ఏరియా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : రాష్ట్ర మంత్రి సీతక్క

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ములుగు ఏరియా ఆస్పత్రికి వచ్చి మృతదేహాలను సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. తక్షణ సాయంగా ప్రభుత్వం తరపున రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం, రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలను అండగా ఉంటా మన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేయాలి

- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మామిడాల యశస్విని రెడ్డి

పెద్దవంగర, జనవరి 26 : రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియాజేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సూచించారు. శుక్రవారం పెద్దవంగరలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధితో పాటు నిరుపేదలకు ఆర్థికంగా వృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారన్నారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని వివరించారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన పార్టీ, కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మండల కేంద్రంలో గౌడ కులస్తులతో కలిసి శ్రీకంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మాజీ జడ్పీ ఫ్లోర్‌లీడర్, సర్పంచ్ ఎన్.ప్రవీణ్‌రావు, మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, సీనియర్ నాయకులు దుంపల శ్యామ్, తోటకూరి శ్రీనివాస్, దేవేంద్ర, గోపాల్, వెంకన్న, ఉపేందర్, రవి, ముత్యాల పూర్ణచందర్, సీతారామ్, శ్రీనివాస్, సోమాచారి, తన్నీరు వేణు, హరిక్రిష్ణ, యాకన్న, రవి, సత్యం, స్వామి, సందీప్, సంతోష్, సాయి, సతీష్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఇద్దరు ఉపాధ్యాయులు

- ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి వెళ్లనున్న వి.గురునాథరావు, కె.శ్రీనివాస్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 26 : న్యూఢిల్లీలో ఈనెల 29వ తేదీ నుంచి 30వరకు జరిగే జాతీయ సదస్సుకు జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ విద్యాప్రణాళిక నిర్వహణ సంస్థ న్యూఢిల్లీలో పాఠశాల నాయకత్వ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న సదస్సుకు ఆహ్వానం అందినట్లు ఉపాధ్యాయులు వి.గురునాథరావు, కె.శ్రీనివాస్ శుక్ర వారం తెలిపారు. సంపూర్ణ పాఠశాలల అభివృద్ధికి పాఠశాల అంతటా సమ్మిళిత నాయకత్వ పర్యావరణ వ్యవస్థ అనే ప్రధాన అంశంపై జరిగే సదస్సులో పాల్గొనను న్నారు. కేసముద్రం మండలం పెనుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతికరసాయనశాస్త్ర ఉపా ధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గురునాథరావు పాఠశాల అభివృద్ధిలో పంపిణీ నాయకత్వ నిర్మాణానికి సంసిద్ధత అనే అంశంపై, నెల్లికుదురు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ కొవిడ్ సమయంలో ఉపాధ్యాయుల శ్రేయస్సుకు నాయకత్వ శైలులు అనే అంశంపై పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. ఈ సదస్సుకు ఎంపికైన ఇరువురు ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అభినందించారు.

డోర్నకల్‌లో బీఆర్ఎస్ నేత అరెస్టు

డోర్నకల్, జనవరి 26 : మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నున్న రమణను ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు చెందిన పోలీసులు శుక్రవారం డోర్నకల్‌లో అరెస్టు చేశారు. మూడేళ్ల క్రితం తిరుమలాయపాలెం మండలంలో ఓ వెంచర్ నందు ఉన్న పెద్ద బండరాళ్లను రమణ అనుమతి తీసుకోకుండానే బ్లాస్టింగ్ చేశారు. ఈ విషయంపై గతంలో కొందరు తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పట్నుంచి ఆయన కేసుకు హాజరు కాకపోవడంతో ఖమ్మం పోలీస్ కమిషనర్ ఆదేశాలతో డోర్నకల్‌లో రమణను పోలీసులు అరెస్టు చేసి, తీసుకువెళ్లారు.

మహా జాతరకు సకల ఏర్పాట్లు

- ఈ నెలాఖరులోగా పనులు పూర్తవుతాయి
- మేడారంలో మంత్రి సీతక్క
- పనుల పురోగతి పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశం



పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

మేడారం, జనవరి 26 : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు, సంక్షేమ శాఖమంత్రి దనసరి సీతక్క తాడ్వాయి మండలం మేడారంలో శుక్రవారం పర్యటించారు. ఆకస్మికంగా వచ్చి పనుల నాణ్యత ప్రమాణాలు, పురోగతిని తనిఖీ చేశారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరిగే సమ్మక్క సారలమ్మల మహాజాతరకు వచ్చే భక్తకోటికి సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసింది. పలుశాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని తిరిగి పరిశీలించారు. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్ పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించిన మంత్రి.. పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. శాశ్వత, తాత్కాలిక ఏర్పాట్ల నిర్మాణపనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఈ నెలాఖరులో పూర్తిచేయాలని సూచించారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, రహదారుల నిర్మాణ పనులు, హరిత హోటల్ మరమ్మతులు, జంపన్నవాగు ఇసుక చదును, ఊటబావుల పూడికతీత, స్నానఘట్టాలపై బాతింగ్ గాడ్స్, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, కొత్తూరు సమీపంలోని తాత్కాలిక మరుగుదొడ్లు, స్థూపంరోడ్, కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ దేవాలయం పరిసరాలు పరిశీలించారు. పూజారి కాక రంజిత్ దేవాలయ సమీపంలో మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. వెంటనే అధికారులను మంత్రి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అనంతరం మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం జాతరకు రాష్ట్రప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని అన్నారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల చివరిలోపు జాతర పనులు పూర్తవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఈవో రాజేంద్రం, డీపీవో వెంకయ్య, ఇంజనీరింగ్ అధికారులు అజయ్‌కుమార్, డీఎస్పీ రవీందర్ పాల్గొన్నారు.

జోరుగా ముందస్తు మొక్కులు



మేడారం, జనవరి26 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శుక్రవారం మేడారం తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీల ఆరాధ్య దేవతలు సమ్మక్క సారలమ్మలకు మహా జాతర ఘనంగా జరగనుంది. ముందస్తుగా మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు తల్లుల గద్దెలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ములుగు జిల్లాఅదనపు కలెక్టర్ శ్రీజ మేడారంలో పర్యటించి సౌకర్యాలను పరిశీలించారు. మందస్తుగా వస్తున్న భక్తులకు కలిగే సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు వైద్యసేవలు అందించకుండా టీటీడీ కల్యాణ మండపంలోని వైద్య శిబిరం మూసివుండడంతో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్యకు ఫోన్‌చేసి కారణాలు అడిగారు. బుధ, గురు, ఆదివారాల్లో వైద్యసేవలు అందిస్తున్నామని డీఎంహెచ్‌వో సమాధానం చెప్పడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు అధికంగా మేడారం వచ్చారని, వారికి ఉచిత వైద్య సేవలు వెంటనే కల్పించాలని ఆదేశించారు. అనంతరం గంట వ్యవధిలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. కాగా, మేడారం మహాజాతరకు తరలివచ్చే భక్తులకు సౌకర్యాల్లో భాగంగా జంపన్నవాగు జంట వంతెనలకు ఇరువైపులా రైలింగ్ పనులు అర్‌అండ్‌బీశాఖ అధికారులు శుక్ర వారం ప్రారంభించారు. భక్తులు వాగులోకి తొంగి చూస్తూ పడిపోకుండా ఎత్తుగా నిర్మిస్తున్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



గుడుంబాను అడ్డుకుంటే కేసులు పెడతారా?

ఎక్సైజ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

హనుమకొండక్రైం, జనవరి 26: ఎక్సైజ్‌శాఖలో విధుల్లో భాగంగా తాము ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని గుడుంబాను నియంత్రించేందుకు కట్టుదిట్టం చేస్తే తమ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమసిబ్బందిపైనే పోలీసు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రొహిబిషన్ అండర్ ఎక్సైజ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. గీసుగొండ మండలం జాన్‌పాక గ్రామానికి చెందిన తేజావత్ బుజ్జి చేసిన ఆరోపణలపై శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తేజావత్ బుజ్జిపై దాడి చేసినట్టు చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. గుడుంబాను విక్రయించకూడదని హెచ్చరించినందుకు కక్షగట్టి తన ఇన్‌స్పెక్టర్ రమేష్‌చందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం సరైంది కాదని అన్నారు. దీనిపై పోలీసులు మరో మారు పునరాలోచించాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామకృష్ణ, చంద్రమోహన్, రమేష్‌చందర్, శశికుమారి పాల్గొన్నారు.

సరస్వతీ బ్యారేజి కరకట్ట నిర్మించండి

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్

మహదేవపూర్, జనవరి 26: కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ బ్యారేజి వెనక వైపుకు కరకట్ట నిర్మించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. శుక్రవారం చెన్నూరు నియోజక వర్గానికి సంబంధించిన రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజిని సందర్శించారు. బ్యారేజిని నిర్మించినప్పటి నుండి ఐదు సంవత్సరాలుగా తమ భూములు ముంపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజి వద్దకు చేరుకొని గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు. బ్యారేజి వెనుకవైపుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి ముంపుకు గురవుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి, అక్కడే ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సి వెంకటేశ్వర్లుకు తెలియజేశారు. తమ భూములు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏ చర్యలు తీసుకున్నారంటూ ఎమ్మెల్యే వివేక్ ఈఎన్‌సిని ప్రశ్నించగా తాము బ్యారేజి వెనకవైపుకు 5.7 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు ప్రపోజల్ పంపించామని, అయితే అప్పుడున్న ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఆ పనులు మొదలుకాలేదని వివరించారు. దీనికోసం 132 కోట్లు అవసరమవుతాయని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తాను సంబంధిత మంత్రితో, అధికారులతో మాట్లాడతానని, పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఈఎన్‌సికి సూచించారు.



మ్యాపు ద్వారా ఎమ్మెల్యే వివేక్‌కు వివరిస్తున్న ఈఎన్‌సీ



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు

నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తా..

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

సుబేదారి, జనవరి 26: నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తానని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. పౌల్ట్రీ పితామహుడు స్వర్గీయ డాక్టర్ బీవీ రావు 28వ వర్ధంతిని హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో బీవీ రావు స్మారకార్థం కోడిగుడ్లను పంపిణీ చేశారు. నెక్ అభివృద్ధికి బీవీరావు ఎంతో కృషి చేశారని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రదీప్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య, వైస్ చైర్మన్ దండ కరుణాకర్‌రెడ్డి, నెక్ జోనల్ కమిటీ మెంబర్లు టి. సుబ్రహ్మణ్యం, బి.శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.రమణారెడ్డి, కోశాధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్పార్కిల్

హసన్‌పర్తి, జనవరి 26 : మండలంలోని అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం రాత్రి జరిగిన సాంస్కృతిక సంబరం స్పార్కిల్-24 అలరించింది. ప్రముఖ సినీ గాయకుడు రామ్ మిరియాల పాటలతో ప్రేక్షకులను మైమరిపించారు. చెమ్కీల అంగిలేసీ ఓ వదినే.., పొట్టిపిల్లా..పొట్టి పిల్లా.., ఓ మాయా మాయా ఓరి మాయారే.., చిట్టీ నీన వ్వంటే లక్ష్మీ పటాసు..వంటి పాటలతో ఉర్రూతలూగించారు. మరో సినీ గాయని సింధూజ శ్రీనివాస్, పాడుతా తీయగా ఫేం శ్రీనివాస భరద్వాజల సినీ గీతాలతో ఉత్తేజపరిచారు. వీరి పాటలకు విద్యార్థులు డ్యాన్స్‌లు చేస్తూ కళాశాల ప్రాంగణం అంతా దుమ్మలేపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పౌరాణిక నాటకం ద్రౌపది వస్త్రాభరణం ఆకట్టుకుంది. జానపద గీతాల నృత్యాలతో ఉత్సాహపరిచారు. అనంతరం యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి వివిధ ఈవెంట్లలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు జరిగిన స్పార్కిల్ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్లు రాజేశ్వర్‌రావు, వినూత్న, శ్రీకర్‌రెడ్డి, డీన్ ఏవీవీ సుధాకర్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న రామ్ మిర్యాల

బల్దియాలో గణతంత్ర వేడుకలు



గణతంత్ర వేడుకల్లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 26: వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన వేడుకల్లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నగర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాల గురించి రిజ్వాన్ తెలియచేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన బల్దియా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఇటీవలే బల్దియా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో..

హనుమకొండ క్రైం: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను వరంగల్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంతో పాటు నగరంలోని పలు పోలీసు స్టేషన్‌లు, ఎక్సైజ్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయంలో స్థానిక పోలీసు అధికారులు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం అక్కడి పోలీసు అధికారులు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు స్వీట్లు పంచారు. తోటి సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని దేశభక్తిని చాటుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయం వద్ద సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని సిబ్బందితో కలిసి ఆలపించారు. అనంతరం సేవా, ఉత్కృష్ట పతకాలను పొందిన పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి పతకాలను సీపీ చేతుల మీదుగా అందించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవయ్యతో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కేయూలో...

కేయూ క్యాంపస్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వివేచన 19 వాల్యూ 1వ సంచికను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు.



కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ జెండాకు నమస్కరిస్తున్న సీపీ, పోలీసు అధికారులు



కేయూలో ప్రసంగిస్తున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్



పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, జనవరి 26: మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని శాకరాసికుంటలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.1.65లక్షల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. శాకరాసికుంటకు చెందిన ఎనగందుల రాజు కొంతకాలంగా తన ఇంటినే అడ్డాగా చేసుకుని అక్రమ మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి మూకుమ్మడిగా దాడులు చేసి అక్రమమద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజు పోలీసులను చూసి పరారయ్యాడు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు. పట్టుకున్న మద్యాన్ని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట, జనవరి 26: కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలో 16 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఒడిస్సాకు చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి 16 కిలోల ఎండు గంజాయితో పట్టుబడ్డారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



మృతుడు సురేష్ (ఫైల్)

నర్సింహులపేట, జనవరి26: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ మండలం సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్ (25) నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట నుంచి ట్రాక్టర్‌లో మొరం సింగారానికి తరలిస్తుండగా, క్లచ్ విరిగిపోయింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ పైకిలేచి డ్రైవర్ సురేష్‌కు తీవ్రగాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న నడికూడలోని రైతు వేదిక

ఉత్సవ విగ్రహాలుగా వేదికలు

● 18 నెలలుగా రాని నిర్వహణ నిధులు ● నిరుపయోగంగా రైతు వేదికలు ● అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్న వైనం
● కొన్నిటిపైనే దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం ● దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్పునకు చర్యలు

"రైతు వేదికల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. కొత్త ప్రభుత్వం వీటిని ఏం చేస్తుందనేది కూడా తెలియడం లేదు. గత ప్రభుత్వం వీటిని అట్టహాసంగా ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ విషయంలో పట్టించుకోక పోవడంతో అవి అన్నీ నిరుపయోగంగా మారాయి. రైతు వేదికల నిర్వహణకు నిధులు ఇవ్వడం నిలిపివేయడంతో వాటి ఆలనాపాలనా చూసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారాయి. దాదాపు 18 నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఏం చేయాలో తెలియక పాట్లు పడుతున్నామని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా వీటిని పట్టించుకుంటుందని రైతులు భావించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు వేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం."

హనుమకొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన రైతు వేదికలు నిరుపయోగంగా తయారయ్యాయి. ఈ భవనాల నిర్మాణం పూర్తయినా అధికారులు వీటిని పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. చాలాచోట్ల భవనాలకు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. పలుచోట్ల మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేదన్న సాకుతో వాటిని నిరుపయోగంగా ఉంచుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట్లో ఈ రైతు వేదికలపై దృష్టి సారించింది. వీటిలో కొన్నిటిని ఎంపిక చేసి వీటిని రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. కానీ ఇంకా పూర్తిగా కార్యరూపం దాల్చలేదు.

ఆర్భాటంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఆరు జిల్లాలు - హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 515 రైతు వేదికలను నిర్మించారు. ఇందుకు రూ.113కోట్లను వెచ్చించారు. ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.22 లక్షలను ఖర్చు చేశారు. ఈ మొత్తంలో రూ.10లక్షలను ఉపాధి హామీ పథకం నిధుల కింద సమకూర్చగా, మిగతా రూ.12లక్షలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. రైతు వేదికలలో ఏఈవో, రైతు వేదిక కోఆర్డినేటర్లకు ఒక్కొక్కటి చొప్పున చాంబర్, 200 మంది రైతులు కూర్చునేందుకు వీలుగా సమావేశ మందిరం, రిసెప్షన్, రెండు మరుగుదొడ్లు నిర్మించేలా డిజైన్ చేశారు. ఒక్కో వేదిక కోసం కనీసం అర ఎకరం, భూమి లభ్యత ఉన్న చోట ఎకరం ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైతు వేదిక తొలి భవనాన్ని జనగామ జిల్లా కొడకండ్లలో 2020 అక్టోబర్ 31న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అట్టహాసంగా ప్రారంభించారు.

నిర్వహణ భారం

రైతు వేదికల ప్రారంభ సమయంలో ప్రభుత్వం నెలకు రూ.9వేల చొప్పున విడుదల చేయడంతో నిర్వహణ సవ్యంగా సాగింది. ప్రభుత్వం ఇచ్చిన ఈ రూ.9వేలలో పరిశుభ్రతో కోసం రూ.3వేలు, శిక్షణ ఖర్చుల కింద రూ.2,500, స్టేషనరీకి రూ.వెయ్యి, విద్యుత్‌చార్జీల కోసం రూ.వెయ్యి మరమ్మతులకు రూ.వెయ్యి, తాగునీటికి రూ.500 ఖర్చు చేసేవారు. అయితే గతంలో వేదికలను శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వారు సైతం వేతనాలు ఇవ్వకపోవడంతో పనులకు రావడం లేదు. పలుచోట్ల ఏఈవోలే కొంత మొత్తాన్ని భరిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నెలకు రెండుసార్లు పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. నిర్వహణకు నిధులు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

అసాంఘిక శక్తులకు అడ్డా..

రైతు వేదికల వద్ద భద్రత లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రివేళ కనీసం కాపలాదారులు లేక వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ సమావేశాల నిర్వహణ కోసం ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు. భద్రత లేకపోవడంతో ఎప్పుడేమి జరుగుతోందనని ఏఈవోలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతీ నెలా నిధులు కేటాయించడంతోపాటు కాపలాదారులను నియమించాల్సిన అవసరం ఉంది.

దృశ్య, శ్రవణ కేంద్రాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లో కొన్నిటిని వాడుకలోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఎంపిక చేసిన కొన్ని వేదికలను వ్యవసాయంలో రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలు తీర్చిదిద్దాలని భావించింది. ప్రయోగాత్మకంగా మొదట రాష్ట్రవ్యాప్తంగా 32 రైతు వేదికలను ఇందుకోసం ఎంపిక చేసింది. ఇందులో పరకాల వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఉన్న రైతు వేదిక ఒకటి. కానీ తర్వాత నియోజకవర్గానికి ఒకటి చొప్పున వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీనితో పలివేల్పులలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పలివేల్పులలో ఉన్న రైతు వేదికను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. పరకాల రైతు వేదికకు దృశ్య, శ్రవణ పరకరాలు మాత్రం వచ్చాయి. సంక్రాంతి పండుగ రోజున అంటే ఈనెల 15న ఈ కేంద్రాలకు ప్రారంభోత్సవం జరుగాల్సి ఉండింది. ఎందుకో ఆ కార్యక్రమం వాయిదా పడింది.

మిగతా వాటి పరిస్థితి ఏమిటి?

కొన్నిటి రైతు వేదికలను మాత్రమే దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చితే మిగతావాటి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. తర్వాతకాలంలో వీటిని కూడా దృశ్య శ్రవణ కేంద్రాలుగా మార్చుతుందా? లేక ఇంతటితోనే సరిపెట్టుకుంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైతేనే మిగతా రైతు వేదికలను కొత్త ప్రభుత్వం పట్టించుకునేట్టు కనిపిస్తుంది. లేదంటే వాటి పరిస్థితి అయోమయమే. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, ఏఈవోలు కోరుతున్నారు. సీజన్లలో రైతులకు పంటలపై తగిన శిక్షణ ఇవ్వడానికి వీలుగా కనీసం నిర్వహణ ఖర్చులైన ఇవ్వాలని వారు కోరుతున్నారు. రైతు వేదికల్లో కనీసం ఒక స్వీపరును, వాచ్‌మెన్ అయినా నియమించాలని కోరుతున్నారు. లేకుంటే అవి క్రమంగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులోని వస్తువులు దొంగలపాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



కాలిన గాయాలతో సతీష్

యజమాని తిట్టాడని ఆత్మహత్యాయత్నం

మేడారం, జనవరి 26: యజమాని తిట్టాడని పెట్రోల్ పోసుకొని యువకుడు నిప్పంటించుకున్న ఘటన తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతల గద్దెల ముఖద్వారం ఎదుట శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఊరుగొండకు చెందిన మేడిపల్లి సతీష్ అనే యువకుడు గత కొన్ని రోజులుగా వరంగల్ జిల్లా కరీమాబాద్‌లోని ఆర్యుఖ బార్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం మేడారం వనదేవతల దర్శనానికి బార్ యజమాని, సతీష్‌తో పాటుగా సహ పనివారిని తీసుకువచ్చారు. వనదేవతల దర్శనం అనంతరం భోజనాల సమయంలో యజమాని మందలించడంతో సమ్మక్క సారలమ్మల దేవస్థానం ప్రధాన ద్వారం ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు మంటలు ఆర్పి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సతీష్ శరీరం 80 శాతం కాలిపోయిందని డాక్టర్లు తెలిపారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

డ్రైయినేజీలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ పాఠశాల బస్సు



డ్రైయినేజీలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

వెంకటాపూర్ (రామప్ప), జనవరి 26: ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు సైడ్ డ్రైయినేజీలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని రామాంజాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రానికి చెందిన నారాయణ హైస్కూల్‌కు చెందిన బస్సు 20మంది విద్యార్థులను ఎక్కించుకుని మండలకేంద్రం వైపు ప్రయాణమైంది. ఈక్రమంలో బస్సు నడుపుతున్న డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో రామాంజాపూర్‌కు చేరుకోగానే అదుపుతప్పి సైడ్ డ్రైయినేజీలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టబోయి ఆగిపోయింది. డ్రైవర్ మద్యంమత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈసంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఐటీడీఏ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పీవో అంకిత్

గిరిజనుల అభివృద్ధే ఐటీడీఏ ధ్యేయం

గణతంత్ర దినోత్సవంలో ప్రాజెక్టు అధికారి అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 26: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంతో ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 75వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఐటీడీఏ జరిగిన వేడుకల్లో ఐటీడీఏ పీవో పాల్గొని పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల కార్యక్రమాలను సకాలంలో అమలు చేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్నట్లు పీవో తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న మేడారం మహాజాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని, 21శాఖల ద్వారా రూ. 75కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పీవో తెలిపారు.

విద్యా విభాగం

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మొత్తం 25,572 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశామని, రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నామని పీవో తెలిపారు.

వైద్య విభాగం

ఐటీడీఏ పరిధిలో ఒక జిల్లా ఆస్పత్రి, మూడు సామాజిక ఆస్పత్రులు, 22ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 122 ఉప ఆరోగ్య కేంద్రాలున్నాయని, వానాకాలంలో దోమల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశమున్నా 174 ఏజెన్సీ గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో దోమ తెరల పంపిణీతోపాటు దోమల మందును పిచికారి చేసి రోగాలను అరికట్టామన్నారు. ఎంసీహెచ్ ఎపిడమిక్ స్కీం ద్వారా ఏప్రిల్ 2023 నుంచి డిసెంబరు 2023 వరకు 1473 మెడికల్ క్యాంపులు నిర్వహించి 69,492 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీవో తెలిపారు. మూడు ఉచిత అంబులెన్స్ పథకం ద్వారా ఇప్పటీ వరకు 3,973మందికి ఉచితంగా వైద్యసేవలందించమన్నారు. 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి న్యూట్రీషన్‌కిట్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

ఇంజనీరింగ్ విభాగం

ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆర్టిక్ 275 కింద గిరిజన భవనాలు, బీటీ రోడ్లు, పాఠశాలల మరమ్మతులకు రూ.528.44 కోట్లు నిధులు కేటాయించగా ఇందులో 1,055 పనులు పూర్తయ్యాయని, 104పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు. అదేవిధంగా ఐటీడీఏపరిధిలో 117 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలకుగాను రూ.500కోట్లు మంజూరు చేశామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద 44సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలకు రూ.704లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇందులో 35పనులు పూర్తి కాగా 3పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు.

ట్రైకార్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు 2020-21, 2022 సంవత్సరానికిగాను 6,761 యూనిట్ల సబ్సిడీ మంజూరు అయ్యాయని, వాటిని మండలాల వారీగా విభజించి మండల అభివృద్ధి అధికారులకు పంపించి ఆన్‌లైన్‌లో పరిశీలించి ఇప్పటివరకు 3,318 యూనిట్లు మంజూరు చేశామన్నారు. సబ్సిడీ డబ్బులు త్వరలో విడుదల చేయనున్నట్లు పీవో వెల్లడించారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 3 ఇటుకల తయారీ యూనిట్లు, 4సెంట్రింగ్ యూనిట్లు, 4 కాంక్రీట్ మిక్స్, ఫుడ్ ట్రాక్ యూనిట్లు గిరిజనులకు మంజూరు చేశామని పీవో తెలిపారు.

గిరిజన మత్స్య పారిశ్రామిక

గిరిజన రైతులకు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సొసైటీలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 15 ఏజెన్సీ మండలాల్లో 814 చెరువులు ఉండగా 101 సొసైటీల రిజిస్ట్రేషన్ జరిగిందని, సొసైటీలకు రూ.కోటి70లక్షల 88వేల చేపపిల్లలను అందించామన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం ద్వారా 7చేపల చెరువులు నిర్మించేందుకు అనుమతి మంజూరు చేశామని, 3యూనిట్లకుగాను రూ.14.8లక్షల సబ్సిడీని గిరిజనులకు విడుదల చేశామన్నారు. అదేవిధంగా గిరిజన మత్స్యకారులకు 37 బైక్‌లు, 2 ఆటోలను మంజూరు చేశామన్నారు.

గిరి వికాసం

గిరివికాసం పథకం ద్వారా గిరిజన రైతుల పొలాల్లో నీటి వసతుల కల్పన కోసం గిరి వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇందుకోసం గిరిజన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని, ఇప్పటివరకు 3,018 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. దీనికిగాను రూ.954.98లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. అదేవిధంగా గిరిజన సహాయనిధి పథకం కింద 476 మందికి రూ.51.17లక్షల నిధులను అందజేశామన్నారు. గిరిజనులు ఆర్థికంగా సామాజికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తోందని పీవో వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని పీవో పిలుపునిచ్చారు. కాగా, ఐటీడీఏలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోదరస్వామి, ఎస్ వో రాజ్ కుమార్, డీడీ పోచం, ఈఈ హేమలత, మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగలో ప్రొటోకాల్ రగడ

● బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట ● పోలీసుల చొరవతో సద్దుమణిగిన గొడవ
● ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఎగురవేసిన హైస్కూల్ హెచ్‌ఎం



జెండా కర్రను గుంజుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, జనవరి 26 : జాతీయ జెండాను ఎగురవేసేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ప్రొటోకాల్ రగడ శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండా వద్ద గణతంత్ర దినోత్సవ సందర్భంగా జెండా ఎగురవేసేందుకు జెండా కమిటీ నిర్వాహకులు ఎంపీపీ అంజయ్యను ఆహ్వానించారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అధికారులు మాత్రమే జెండా ఆవిష్కరణ చేయాలని, బీఆర్ఎస్ నాయకులు చేయవద్దని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఏర్పాటు చేసిన జెండాను తొలగించి కర్రను ఒకరికొకరు గుంజుకోవడం చేశారు. జాతీయ జెండా ఏర్పాటు కోసం నిర్వహణ కమిటీ రూ.20 లక్షల నిధులతో ఫెన్సింగ్, గార్డెనింగ్, సీసీకెమెరాల ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశామని, మేమే జెండా ఎగురవేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ అధికారులే జెండా ఆవిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరుగుతున్న జెండా వేడుకలకు అధికారులు ఎమ్మెల్యేను, ఇతర ప్రభుత్వ అధికారులను పిలవకుండా ప్రొటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. వంద అడుగుల జెండాను ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తుంటే ప్రజా ప్రతినిధులను, అధికారులను పిలవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఇరు వర్గాలను హెచ్చరించారు. జెండా ఎగురవేయకుండా ఆపడం సరికాదని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జెల్ల లక్ష్మీనారాయణతో జెండా ఆవిష్కరణ చేపట్టారు. సంఘటనా స్థలానికి సీఐ సత్యనారాయణ, ఎస్సై జగదీష్, ఆర్డీవో నర్సింహ రావు, ఇతర అధికారులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

ఒకే ప్రాంగణంలో రెండు జెండాలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ గణతంత్ర దినోత్సవ వేడుకల జెండా ఆవిష్కరించారు. అదే పాఠశాల ఆవరణలో ఉన్న వంద అడుగుల జాతీయ జెండా వద్ద ఏర్పాటు చేసిన మరో జెండాను కూడా హెచ్‌ఎం లక్ష్మి నారాయణ ఆవిష్కరించారు. ఒకే ప్రాంగణంలో రెండు జెండాల ఆవిష్కరణపై హెచ్‌ఎం లక్ష్మి నారాయణను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరించానని తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవిందర్‌రావు

డీసీసీబీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు

హనుమకొండ టౌన్, జనవరి 26: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను హనుమకొండలోని డీసీసీబీ హెడ్ ఆఫీస్‌లో ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మార్నేని రవిందర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు జగన్‌మోహన్‌రావు, రవిరాజ, నరేందర్, సీఈవో ఎండి.వజీర్ సుల్తాన్, డీజీఎం కురువ నాయక్, ఏజీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీ చేతుల మీదుగా ఉత్కృష్ట సేవాపతకాన్ని స్వీకరిస్తున్న రమేష్

ఒంటేరు రమేష్‌కు ఉత్కృష్ట సేవాపతకం

సీపీ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా స్వీకరణ

హనుమకొండ క్రైం, జనవరి 26: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచి)లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఒంటేరు రమేష్‌కు పోలీసు శాఖలో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఉత్కృష్ట సేవా పతకం లభించింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసినకాలంలో స్థానిక ప్రజలకు విశేష సేవలను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిషలు కృషి చేసిందుకు కాగాను ఉత్కృష్ట సేవా పతకం లభించింది. శుక్రవారం వరంగల్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ల చేతుల మీదుగా పతకాన్ని స్వీకరించారు. తనకు ఉత్కృష్ట సేవాపతకం రావడం చాలా ఆనందంగా ఉందని, తన సేవలను గుర్తించిన పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు రమేష్ తెలిపారు. రమేష్‌కు ఎస్‌బీ విభాగం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న కిరణ్ కుమార్

రాష్ట్రస్థాయి ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్

హనుమకొండ అర్బన్, జనవరి 26: ఔషధ నియంత్రణ శాఖ హనుమకొండ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అవార్డును కిరణ్ కుమార్ అందుకున్నారు. విధి నిర్వహణలో కచ్చితత్వమే అవార్డు తెచ్చిపెట్టిందని పలువురు కెమిస్టులు ప్రశంసించారు.



అవార్డులు అందుకుంటున్న సిబ్బంది

జైలు సిబ్బందికి అవార్డులు

హనుమకొండ రూరల్, జనవరి 26: వరంగల్ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రత్యేక అవార్డులను అందుకున్నారు. కేంద్ర కారాగార డీజీ సౌమ్యామిశ్రా వారికి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో పరావస్తు వెంకటేశ్వరస్వామికి ఎక్స్‌లెన్స్ సర్వీస్ కింద రూ.5వేల క్యాష్ రివార్డు, డిప్యూటీ జైలర్ శెంకేసి వెంకటేశ్వర్లు ఔట్‌స్టాండింగ్ ఫెర్మామెన్స్ కింద, హెడ్‌వార్డర్ మెట్టు చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ టి.ప్రతిభారాణి అందుకున్నారు.

క్రీడలతో స్నేహం ఏర్పడుతుంది

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు రూరల్, జనవరి26 : క్రీడలతో క్రమశిక్షణ, స్నేహబంధం ఏర్పడుతుందని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలేపల్లిలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్, నాటికలు, పాటలు, సాంస్కృతిక క్రీడాపోటీల్లో గెలుపొందిన ప్రతిభ వంతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, క్రీడలతో శారీరదారుఢ్యం తో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవచ్చన్నారు. ముందుగా కర్కాలలో పేదరికంతో ఇబ్బంది పడుతున్న చీరాల సోమలక్ష్మి, కలమ్మలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, సర్పంచ్ పి.యాకయ్య వైఎస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, యూత్ సభ్యు లు పయ్యావుల ప్రవీణ్‌యాదవ్, అనిల్, కాగు రాజు, అనిల్, సుంచు సంతోష్ పాల్గొన్నారు.

పలువురికి అవార్డుల ప్రదానం


సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ అనురాధకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వీరన్న

గూడూరు, జనవరి 26 : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ బి.వీరన్న అవార్డులు, ప్రశంసా పాత్రలను అందించారు. డాక్టర్ స్రవంతి, సీనియర్, జూనియర్ నర్సింగ్ అధికారులు ఎం.అనురాధ, ఉమ, అనిత, పద్మ, ఇందుమతి, జ్యోతిలక్ష్మి, విజయశేఖర్, రాజశేఖర్, గౌసియా, శైలజ, లింగమూర్తి, ఖలీమ్, కల్యాణిలకు అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను డాక్టర్ వీరన్న అందించారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి


సైదులు (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జనవరి 26 : రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరి తీవ్ర గాయాలైన ఘటన మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. గార్ల మండలం బుద్దారం గ్రామానికి చెందిన పేరం ముత్తయ్య, దర్గమ్మ దంపతుల కుమారుడు పేరం సైదులు (20) గూడూరు బొద్దుగొండకు చెందిన మేనమామ పగడాల వీరన్న ఇంట్లో ఉంటూ గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బొద్దుగొండ నుంచి మహబూబాబాద్‌కు వస్తుండగా కంబాలపల్లికి చెందిన పున్నపుర్తి వీరమల్లు బైక్ ఢీకొట్టగా వీరమల్లు కాలు విరగగా, సైదులు తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు.

దైవదర్శనం కోసం వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ పాదయాత్ర


తిరుపతి తిరుమల దైవ దర్శనానికి పాదయాత్ర చేస్తున్న గండ్ర జ్యోతి

దంతాలపల్లి, జనవరి 26 : వరంగల్ జడ్పీచైర్ పర్సన్ గండ్ర జ్యోతి తిరుపతి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి (టీటీడీ) దైవ దర్శనం చేస్తున్న పాదయాత్ర శుక్రవారం దంతాలపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. దీంతో స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దంపతులు పరకాలలో సుమారు రూ.14 కోట్లతో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. దీంతో ఆమె తిరుమలకు ఈనెల 15న తన పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వామి వారి దర్శనం కోసం ప్రతీరోజు 35 నుంచి 40 కిలో మీటర్లు పాదయాత్ర చేస్తున్నానన్నారు. ఫిబ్రవరి 15 కల్లా స్వామి వారి దివ్యదర్శనం చేసుకుంటామన్నారు. తనతో పాటు పాదయాత్రలో 10 మంది వేంకటేశ్వర స్వామి వారి భక్తులు పాల్గొంటున్నారన్నారు.


జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్

జిల్లాలో ఉత్తమ ఉద్యోగులు వీరే


జోగుల చెన్నయ్య అదనపు ఎస్పీ | అలివేలు మానుకోట ఆర్డీవో | శోభన్‌కుమార్ కెనరా బ్యాంక్ మేనేజర్ | సత్యనారాయణ మానుకోట డీఎస్పీ | వెంకటేశ్వరబాబు తొర్రూరు డీఎస్పీ | లక్ష్మీనారాయణ ఇన్‌చార్జి డీపీవో | ఖుర్షీద్ డిస్ట్రిక్ కోఆపరేటివ్ అధికారి | మోహన్‌రావు, పీఆర్ డిప్యూటీ ఈఈ | జె.సుధాకర్ జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి | సురేందర్ మిషన్ భగీరథ ఈఈ (గ్రిడ్) | సూర్యనారాయణ ఉద్యానవన శాఖ అధికారి | నర్సింహాస్వామి, బీసీ వెల్ఫేర్ అధికారి | బాలరాజు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ | కిరణ్ ఎక్సైజ్ అధికారి | రమాదేవి జడ్పీ సీఈవో | నర్మద జడ్పీ డిప్యూటీ సీఈవో | హరిప్రసాద్ డీపీవో | ఆర్.సన్యాసయ్య డీఆర్‌డీఏపీడీ | పి.సుబ్బారావు సీపీవో | ఎంవీఐ ఎం.వెంకన్న | నరేష్‌కుమార్ విద్యుత్ శాఖ అధికారి


కె.సురేష్ పీఆర్ ఈఈ | వరలక్ష్మి డీడబ్ల్యూవో | ప్రసన్నారాణి మునిసిపల్ కమిషనర్ | భగవాన్‌రెడ్డి తహసీల్దార్ | వివేక్ తహసీల్దార్ | ఎ.రవీంద్రనాథ్ కలెక్టర్ సీసీ | తిరుపతి సీనియర్ అసిస్టెంట్ | మాల్యానాయక్ డీటీ | రమేష్‌బాబు ఎస్సై | శ్రీనివాసరావు డీపీఆర్వో | తానేశ్వర్ ఆర్‌అండ్‌బీ ఈఈ | హైమద్ విద్యుత్ ఉద్యోగి | రాములు టీచర్ | ప్రవీణ్ ఉపాధ్యాయుడు | ప్రభావతి సీఆర్‌పీ | శ్రీనివాస్ వైద్యశాఖ | వీరన్న ఏఎస్సై | గణేష్ డీపీటీ డీఆర్‌డీఏ

మహబూబాబాద్ టౌన్, జనవరి 26 : మహబూబాబాద్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లాలో ఉత్తమ సేవలందించి ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ చేతుల మీదుగా శుక్రవారం ప్రశంసా పత్రాలను అందించారు.జిల్లా వ్యాప్తంగా 184 మందిని ఉత్తమ ఉద్యోగులకు ఎంపిక చేసి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్


జిల్లా కోర్టులో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్


జిల్లా గ్రంథాలయంలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో


జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్

మహబూబాబాద్ టౌన్, జనవరి 26 : జిల్లా వ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని శాఖల కార్యాలయాల్లో అధికారులు జాతీయ పతాకాలను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కలెక్టర్‌కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సవ్‌టొప్పో. ఎం.డేవిడ్, జిల్లా అధికారులు సన్యాసయ్య. వెంకటరమణ, రామారావు, ఖుర్షీద్, పి.సుబ్బారావు నర్మద, వరలక్ష్మి పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీపాటిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదనపు ఎస్పీ జి. చెన్నయ్య పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

● జిల్లా గ్రంథాలయంలో జాతీయ పతాకాన్ని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో ఆవిష్కరించగా సిబ్బంది వీరేందర్, భూలక్ష్మి, విజయ్, విజేందర్, పాఠకులు అరుణజ్యోతి, పూజిత పాల్గొన్నారు.

● జిల్లా న్యాయస్థానంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయమూర్తి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి, పీపీ చిలకమారి వెంకటేశ్వర్లు, జీపీ వెంకటయ్య, ఏజీపీ బి.ఆనంద్‌గుప్తా పాల్గొన్నారు.

● సబ్‌జైల్‌లో జైల్ సూపరిండెంట్ మల్లెల శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా డిప్యూటీ జైలర్ రవీందర్, భిక్షపతి, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామారాజు పాల్గొన్నారు.

● జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవో రమాదేవి జాతీయ జెండాను ఆవిష్కరించగా డిప్యూటీ సీఈవో నర్మద, జడ్పీటీసీలు మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి ఝాన్సీలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు ఖాసీం పాల్గొన్నారు.

● మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా ఎంపీపీ భూక్య మౌనిక, వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య, ఎంపీవో హరిప్రసాద్, ఏపీఎం రమేష్‌రెడ్డి, సూపరిండెంట్ రాధిక పాల్గొన్నారు.

● మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసన్నారాణి జాతీయ జెండాను ఆవిష్కరించగా చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఎమ్డీ.ఫరీద్, కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, సూర్నపు సోమయ్య, ఎడ్ల వేణు పాల్గొన్నారు.

● మార్గదర్శి బీఈడీ కళాశాలలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్, అధ్యాపకులు బాలాజీ, శేఖర్, శ్రీరాం పాల్గొన్నారు.

● వికాస్ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ బిక్కి. వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా ప్రిన్సిపాల్ వీరయ్య, నీలం వెంకన్న, సారంగం, వీరన్న, యుగేందర్, వెంకన్న, రవి, ఆసియానస్రీమ్, సునిత, శ్రీనివాస్, కిషన్, కృష్ణమాచారి, యాకయ్య, భిక్షపతి, నాగరాజు పాల్గొన్నారు.

● జమాండ్లపల్లి విద్యాభారతి పాఠశాల వేడుకల్లో కరస్పాండెంట్ తక్కెళ్లపల్లి విజితాప్రభాకర్‌రావు, ప్రిన్సిపల్ వరలక్ష్మి పాల్గొన్నారు.

● ఆర్టీసీ డిపోలో మేనేజర్ శివ ప్రసాద్ , సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

● మహబూబాబాద్‌ప్రింటర్స్ అసోసియేషన్ వేడుకల్లో అధ్యక్షుడు నక్క నాగార్జున, ఎడ్ల ఉప్పలయ్య శ్రీనివాసచారి, నీలం రాజు, బల్లెం శ్రీనివాస్, వీఎస్. చారి, వెంకన్న, వెంకటేష్, యాకయ్య, ప్రభాకర్, సురేష్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

● నలంద డిగ్రీ, జూనియర్, పారామెడికల్ కళాశాలల్లో నిర్వహించిన వేడుకల్లో కరస్పాండెంట్ డాక్టర్ జోలి సత్యనారాయణ, డైరెక్టర్ జోలి సాధన, ప్రిన్సిపల్‌లు వై.కృష్ణప్రసాద్, గట్ల శ్రీపాల్‌రెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు

● తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు బిడుదుల గోపాల్, వెంకట్, సత్యప్రసాద్, శ్రీనివాస్, శంకర్‌నాయక్, నవీన్, సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల కార్యాలయాల్లో..

● బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోతు కవిత జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి


మహబూబాబాద్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

రవీందర్‌రావు, చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, గద్దె రవి, ఎమ్డీ.ఫరీద్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, గుండా రాజశేఖర్, జెరిపోతుల వెంకన్న, షేక్. మహబూబ్‌పాషా, మంగలంపల్లి కన్న, దాసరి రావిష్, గోగులరాజు, మందులరఘు పాల్గొన్నారు.

● బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా యాప సీతయ్య, బోయినపల్లి లక్ష్మణ్ రావు, మోసంగి మురళీ, ఓర్సుపద్మావతి, భద్రయ్య, రేష్మ, ఇందుభారతి, సందీప్, సురేందర్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం, నర్సంపేట బైపాస్‌లో జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, ఎమ్డీ. అరుణ్, వీరభద్రం, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, రాంచంద్రు, ఆరెందుల వెంకటేశ్వర్లు, నరేష్, యుగేందర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కొండపల్లి రాంచందర్‌రావు, ప్రేమ్‌చంద్ వ్యాస్, రాంచంద్రమ్మ, ఎల్లయ్య నవీన్, యాకయ్య, రాము, శ్రీను, మౌనిక, వెంకన్న, నర్సయ్య పాల్గొన్నారు.

● బీఎస్పీ వేడుకల్లో రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, ఉపేందర్, ప్రసాద్, నాగన్న, బుచ్చిరాములు,చాణక్య, నాగరాజు,రాంబాబు, శేఖర్, అమ్జద్‌అలీ, రాము పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

తొర్రూరు కోర్టులో జడ్జి ఎం.సరిత, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో నర్సింహారావు, తహసీల్‌లో తహసీల్దార్ వినోద్‌కుమార్, మండల పరిషత్‌లో ఎంపీడీవో కుమార్, ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ మురళీధర్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, పీఎస్‌లో సీఐ సత్యనారాయణ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండల పరిషత్ వేడుకల్లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొన్నారు.

● చిన్నగూడూరులో ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లలో ఎంపీడీవో శ్యాంసుందర్, తహసీల్దార్ మహబూబ్‌అలీ, కానిస్టేబుల్ రేఖనా యక్‌లు, ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● మరిపెడ తహసీల్‌లో తహసీల్దార్ సైదులు, మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సింధూరకుమారి, మండల పరిషత్‌లో ఎంపీడీవో ధన్‌సింగ్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజు, పీఏసీఎస్‌లో చైర్మన్ చాపల యాదగిరి రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. గాంధీ విగ్రహానికి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు పూలమాలలు వేసి నివాళ్లర్పించగా కుడితి మహేందర్‌రెడ్డి, లక్ష్మిపతి పాల్గొన్నారు.

● మరిపెడ మండలంలో అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో హెచ్‌ఎంలు, గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు జెండాలను ఆవిష్కరించారు.

● దంతాలపల్లిలోని బీజేపీ కార్యాలయంలో చీకటి మహేష్, దాట్లలో సర్పంచ్ రవీందర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రమేష్‌బాబు, తహసీల్దార్‌లో తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల పరిషత్‌లో ఎంపీడీవో విజయలక్ష్మి జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● నర్సింహులపేటలో తహసీల్‌లో తహసీల్దార్ వివేక్, మండల పరిషత్‌లో ఎంపీడీవో భారతి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సతీష్, సొసైటీలో చైర్మన్ సంపెట రాముగౌడ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● గార్ల తహసీల్‌లో తహసీల్దార్ కె.స్వాతిబిందు, మండల పరిషత్‌లో ఎంపీడీవో రవీందర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జినిత్‌కుమార్, ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ చింత రమేష్, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో కావటి రామారావు, సొసైటీలో చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దామోదర్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ-2 రాజయ్య, మార్కెట్‌లో ప్రత్యేక హోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు, కూడళ్లలో ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు జాటోత్ హరీష్‌నాయక్, బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షులు నజీర్‌అహ్మద్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వల్లందాసు రవి, కేసముద్రం విలేజి శ్రీవివేకవర్ధిని హైస్కూల్లో కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, లయన్స్ భవన్‌లో క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్, రెడ్డి సంఘం భవనంలో అధ్యక్షుడు ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి, బేరువాడలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి పాల్వాయి బుచ్చిరాములు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

● డోర్నకల్ తహసీల్‌లో తహసీల్దార్ నాగభవాని, మండల పరిషత్‌లో ఎంపీడీవో చలపతిరావు, మునిసిపల్‌లో కమిషనర్ మున్వర్‌అలీ, పోలీస్ స్టేషన్‌లో సీఐ ఉపేందర్‌రావు, పీహెచ్‌సీలో డాక్టర్ సాద్విజ, గాంధీసెంటర్‌లో మునిసిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం, ఎస్టీ హాస్టల్లో వార్డెన్ ఈసం వీరస్వామి, మైనార్టీ బాలికల పాఠశాలలో రిజ్వానబేగం, సెర్ప్ కార్యాలయంలో ఏపీఎం శంకర్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● సీరోలు కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విజయ్‌రాంకుమార్, ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● కురవి తహసీల్‌లో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, మండల పరిషత్‌లో ఎంపీడీవో సరస్వతి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గోపి, కురవి వీరభద్రస్వామి దేవాలయంలో ఈవో సత్యనారాయణ, వ్యవసాయ కార్యాలయంలో ఏవో మంజుఖాన్, సొసైటీలో చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, నాగార్జున విద్యాలయంలో కరస్పాండెంట్ రవి, సిద్దార్థ విద్యాలయంలో కరస్పాండెంట్ కార్తీక్, గ్రామపంచాయతీలో సర్పంచ్ నూతక్కి పద్మ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం జాతీయ పతకాన్ని ఎగురవేయగా.. ఎర్ర నాగేశ్వర్‌రావు, అవిరె మోహన్‌రావు, ఎస్.రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.

● కొత్తగూడలో తహసీల్‌లో తహసీల్దార్ రమాదేవి, ట్రాన్స్‌కోలో ఏడీఈ కవిత, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు సారయ్య, బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వేణుతో పాటు అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● నెల్లికుదురు తహసీల్‌లో తహసీల్దార్ కె.రాజు, మండల పరిషత్‌లో ఎంపీడీవో శేషాద్రి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్రాంతికిరణ్, కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్, కాసం లక్ష్మారెడ్డిలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● పెద్దవంగర తహసీల్‌లో తహసీల్దార్ మహేందర్, మండల పరిషత్‌లో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో రాజు, మండల సమైఖ్యలో ఏపీఎం రమణచారి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఐలయ్య, బీజేపీ కార్యాలయంలో రంగు రాములు జాతీయ జెండాలను ఆవిష్కరించగా ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జడ్పీటీసీ జ్యోతిర్మయి, రాంచంద్రయ్యశర్మ, సంజయ్ పాల్గొన్నారు.

● గూడూరు తహసీల్‌లో తహసీల్దార్ అశోక్‌కుమార్, మండల పరిషత్‌లో ఎంపీడీవో రోజారాణి, అటవీశాఖ కార్యాలయంలో రేంజ్ అధికారి సురేష్, ఫారెస్టు డివిజనల్ కార్యాలయంలో ఎఫ్‌డీవో చంద్రశేఖర్, అగ్రికల్చర్ కార్యాలయంలో ఏవో అల్లె రాకేష్, గ్రామపంచాయతీలో సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, అరవింద పాఠశాలలో కరస్పాండెంట్ పింగిలి శ్రీనివాస్, సీహెచ్‌సీలో సూపరిండెంట్ డాక్టర్ వీరన్నలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● బయ్యారంలో తహసీల్‌లో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మండల పరిషత్‌లో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, గాంధీ విగ్రహం వద్దమండల కాంగ్రెస్ అధ్యక్షులు కంబాల ముసలయ్య, వ్యవసాయ కార్యాలయంలో ఏవో రాంజీ, పోలీస్‌స్టేషన్‌లో సీఐ బాబురావు, ఎస్సై ఉపేందర్, బయ్యారం గ్రామపంచాయతీలో సర్పంచ్ కోటమ్మ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

'దళిత ప్రజాప్రతినిధులను అవమానించడం సరికాదు'

తొర్రూరు, జనవరి 26 : ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహణ కమిటీతో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండా వద్ద జెండా ఆవిష్కరించేందుకు వచ్చిన దళిత ప్రజాప్రతినిధులను అవమానించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దిగజారుడు రాజకీయాలను ప్రతీ ఒక్కరు ఖండించాలని ఎంపీపీ టీసీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అనేక వ్యయప్రయాసలను వడికట్టి, ఓర్చుకుని దాతల సహకారంతో వంద అడుగుల జెండాను ప్రజల మద్దతుతో జెండాను ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి నుంచి నిర్వహణ కమిటీ బాధ్యతలు తీసుకుని వేడుకలు నిర్వహిస్తుంది. జెండా ఆవిష్కరించేందుకు వెళ్లిన దళిత ప్రజాప్రతినిధులను అవమానపర్చి జెండా ఎగురవేయకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. రాజకీయంగా అణిచివేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పోటీపడాలి తప్ప ప్రోటోకాల్ వద్ద కాదన్నారు. కమిటీ సభ్యుల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దౌర్జన్యాలకు పాల్పడుతూ కార్యక్రమాలు నిర్వహించకుండా అడ్డుకుని రాద్ధాంతం సృష్టించారని విమర్శించారు. తొర్రూరు పట్టణంలో నిస్వార్థంగా పని చేసే వారిని గుర్తించకుండా గణతంత్ర వేడుకల సమయంలో రాద్ధాంతానికి పాల్పడటం తగదన్నారు. దళిత ప్రజాప్రతినిధులంటే చులకన భావంగా చూడటం సరికాదని, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యా వంతులు, మేధావులు ఈసంఘటనను ఖండించాలని కోరారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బిందు శ్రీను, దొంగరి శంకర్, కాలు నాయక్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డును అందుకున్న టీడబ్ల్యూ ఉద్యోగులు


అవార్డును అందుకుంటున్న వార్డెన్ వివేకానంద

కొత్తగూడ, జనవరి 26 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు ఏటూర్‌నాగారంలో ఐటీడీఏ పీవో అంకిత్ చేతుల మీదుగా శుక్రవారం ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకున్నారు.కొత్తగూడలోని గిరిజన సంక్షేమశాఖ ఎస్ఎంహెచ్ వార్డెన్ జాటోత్ వివేకానంద, మడగూడలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గ్రేడ్ వర్కర్‌గా పనిచేస్తున్న వాసం లక్ష్మి ఉత్తమ అవార్డులు అందుకున్నారు. కొత్తగూడ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హైమద్ మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్న వివేకనంద, వాసం లక్ష్మి, హైమద్‌ను పలువురు అభినందించారు.